అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం



గజ్వేల్ మార్కెట్ కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న అధికారి, వేదికపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు

గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం గురువారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ సమక్షంలో స్థానిక మార్కెట్ యార్డులో అట్టహాసంగా సాగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు తరలొచ్చారు. ప్రజ్ఞాపూర్ నుంచి సభాస్థలి ఏర్పాటు చేసిన గజ్వేల్ మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్‌టాప్ ప్రత్యేక వాహనంలో మంత్రులు ప్రజలకు అభివాదం చేస్తూ సభాస్థలికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మత్స్యకార్పొరేషన్ ఛైర్మన్ సాయికుమార్, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్‌లు ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, తూప్రాన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతి, నాచగిరి ట్రస్ట్ మాజీ ఛైర్మన్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, మసీదు కమిటీ ఛైర్మన్ మతీన్, ఏఎంసీ కార్యదర్శి జాన్‌వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్దుకుంటూ.. సంబోధిస్తూ..

● 12:30 గంటలకు ప్రజ్ఞాపూర్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేరుకున్నారు. గజ్వేల్‌లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీని కారులోంచి పరిశీలించారు. ● 1:30 గంటలకు ర్యాలీగా అభివాదం చేస్తూ మంత్రులు బయలుదేరారు. వేదిక వద్దకు నేరుగా మంత్రి కొండా సురేఖ చేరుకున్నారు. ● స్వాగతోపన్యాసం చేసిన ఏఎంసీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తన ప్రసంగంలో అన్నా అని సంబోధించి తప్పయిందని చెప్పడంతో అందరూ నవ్వారు. ● గజ్వేల్‌కు బదులు దుబ్బాక నియోజకవర్గం అని కొండా సురేఖ సంబోధించారు. వెంటనే ఆమె సర్దుకొని సరిగా చెప్పారు. ● ఎన్నికల్లోనూ, అన్నింటా కేసీఆర్‌తో తలపడుతున్నామని పెద్దల ఆశీర్వాదాలు తమపై మెండుగా ఉండాలని సభకు అధ్యక్షత వహించిన డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మంత్రులను కోరారు.

ప్రాణాలు తీస్తున్న తీగలు

● పరిహారానికి ఎదురుచూపులు

సిద్దిపేట అర్బన్, దుబ్బాక, న్యూస్‌టుడే:



సిద్దిపేట రేణుకానగర్‌లో ఇళ్లపై తీగలు

● దుబ్బాక మండలం రాజక్కపేటలో జులై 30న వృద్ధుడు కట్ట తిరుపతి యాదవ్ పొలంలో ఒడ్డు చెక్కుతూ విద్యుత్తు తీగ తగిలి మృత్యువాత పడ్డాడు. రైతుబీమాకు అనర్హుడు కావడంతో వారి కుటుంబ సభ్యులు విద్యుత్తు శాఖ తరుపున అందించే పరిహారం కోసం దరఖాస్తు చేశారు. రెండు నెలలవుతున్నా పరిహారం అందలేదు.

● సెప్టెంబరు 18న నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన నిరుగొండ వెంకటయ్య మొక్కజొన్న చేనులో ఏర్పాటు చేసిన ఇనుప తీగకు విద్యుత్తు ప్రసారమై తగలడంతో మృత్యువాత పడ్డాడు.

జిల్లాలో ఎక్కడో ఒకచోట విద్యుదాఘాతంతో ప్రజలు, రైతులు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మానవ తప్పిదమైనా, అధికారుల నిర్లక్ష్యమైనా నష్టపోయేది కుటుంబాలే. పొలాల గట్లపై గడ్డి తొలగించే సమయంలో, గాలిదుమారాలకు తీగలు తెగి కిందపడిపోయిన సమయంలో వాటిని గమనించకుండా వ్యవసాయ క్షేత్రాల్లో తిరుగుతుండటంతో ప్రమాదాలకు గురై రైతులు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. విద్యుత్తు ప్రమాదాల బారిన పడి మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తోంది. బాధిత కుటుంబ సభ్యులకు సరైన అవగాహన లేకపోవడంతో ధ్రువపత్రాలు పూర్తి స్థాయిలో అందజేయడం లేదు.

విద్యుదాఘాతానికి కారణాలు

● బోరు మోటార్ల స్టార్లర్ డబ్బాలు ● నియంత్రిక నిలుపుదల చేసే సమయం ● పాత భవనాల తేమ గోడలు ● దుస్తులు ఆరబెట్టుకునే తీగలు ● పొలం గట్టుపై తీగ తెగడం

అందేలా చర్యలు తీసుకుంటాం:

విద్యుత్తు ప్రమాదాల బారినపడిన బాధిత కుటుంబ సభ్యులకు పరిహారం అందించేలా తగు చర్యలు తీసుకుంటాం. మరణానికి సంబంధించిన ధ్రువపత్రాలు ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక తదితర పత్రాలు వెంటనే అందజేస్తే పరిహారం మంజూరులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి.
– చంద్రమోహన్, ఎస్ఈ, సిద్దిపేట

విద్యుత్తు ప్రమాదంలో పరిహారం తీరు (అక్టోబరు 2 వరకు)

సంవత్సరం	మృతులు	మంజూరు	ప్రాసెస్	ధ్రువపత్రం లేనివి
2023	36	20	6	10
2024	9	0	1	8

బియ్యం కుతకుత.. నూనె సలసల

సిద్దిపేటకు చెందిన సురేశ్ చిరుద్యోగి. చిన్న పాటి వేతనంతో ఆరుగురి కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. ప్రతి నెలా ప్రణాళికతో వెచ్చిస్తుంటారు. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులకు పక్కాగా ఖర్చుపెడుతుంటారు. కొన్నాళ్లుగా పెరిగిన ధరలతో లోటు బడ్జెట్ ఎదుర్కొంటున్నారు. నిత్యావసర ధరలు అమాంతం పెరగడంతో ప్రతి నెలా రూ.3 వేలు ఖర్చు చేయగా.. కొన్నాళ్లుగా ఆ పద్దు రూ. 4,500కు పెరిగింది.

న్యూస్‌టుడే, సిద్దిపేట, చిన్నకోడూరు

నూనె ధర చేజారుతోంది.. బియ్యం ఉడకనంటోంది.. పప్పు బద్ధకిస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న నిత్యావసర ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు బేజారవుతున్నాయి. ప్రతి నెలా నిర్వహణ ఖర్చులు భారంగా మారుతున్నాయి. ఇంటి సారథి.. కుటుంబాన్ని వెళ్లదీసేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న ధరలతో షాక్‌కు గురవుతున్నారు. పెద్ద పండగలైన దసరా, దీపావళి వచ్చేశాయి. పండగల వేళ జనమంతా ఇబ్బందులకు గురవుతున్నారు.

పండుగల వేళ ధరల దడ



దడ పుట్టిస్తోంది..

పెరుగుతున్న బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. క్వింటాకు రూ.500 నుంచి రూ. వేయి వరకు పెరిగింది. నెల వ్యవధిలో పెరుగుదల ప్రభావం చూపింది. ఐదుగురు ఉండే ఇంట్లో నెలకు కనీసం 40 నుంచి 50 కిలోల బియ్యం వాడుతారు. పాత సన్నబియ్యం ధరలు భారీగా పెరగడంతో దొడ్డురకం వైపు మళ్లుతున్నారు.

సన్నబియ్యం ధర (రూ.లలో..)	
గతేడాది	5500
ప్రస్తుతం	7000



20 శాతం పెరిగి..

వంటనూనె ధరలకు రెక్కలొచ్చాయి. 15 రోజుల్లోనే 20 శాతానికి పైగా పెరిగింది. ఈ మార్పు స్పష్టమైంది. సన్ ఫ్లవర్, రైస్ బ్రాన్, పల్లీ నూనె కొనలేని పరిస్థితి. ప్రతి నెలా సగటున 5 కిలోలు వినియోగించగా.. ఇప్పుడు 3 కిలోలకు తగ్గించేందుకు చూస్తున్నామని గజ్వేల్‌కు చెందిన మారుతి చెప్పుకొచ్చారు. పండుగ సీజన్‌లో పిండి వంటలకు నూనె వినియోగం తప్పనిసరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో పడిపోతున్నారు.

నూనె ధర (రూ.లలో..)	
గతేడాది	110
ప్రస్తుతం	135




కొనలేక..


ఎండు కొబ్బరి వంటకాల్లో రుచిని పెంచుతుంది. చిక్కదనాన్ని, పోషకాలను అందిస్తుంది. పది రోజుల్లో ధర అమాంతం పెరిగింది. ఆరు నెలల్లో పప్పుల ధరలు పెరిగాయి. మరోవైపు కిలో నువ్వులు రూ. 180కు చేరింది. చక్కెర రూ.41, గోధుమపిండి రూ.40, రవ్వ- రూ.42 పలుకుతోంది. గతంతో పోలిస్తే రూ.5 పెరిగినట్లు స్పష్టమవుతోంది. కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి.

నిత్యావసరం	గతేడాది	ప్రస్తుతం (రూ.లలో..)
ఎండుకొబ్బరి	140	220
కంది పప్పు	140	180
పెసర పప్పు	110	130
శనగ పప్పు	80	120
చక్కెర	38	42
చింతపండు	100	140

నిత్యావసర ధరలు తగ్గాలంటే ఏం చేయాలి?

జిల్లాలో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన 100 మందితో 'న్యూస్‌టుడే' నిర్వహించిన సర్వేలో ఇలా స్పందించారు.





ప్రభుత్వం నుంచి మీరు కోరుకునేది?



అదుపులోకి తేవాలి: పుష్పలత, సిద్దిపేట

మా ఇంట్లో ఆరుగురం ఉంటాం. నేను, మావారు చిన్న వ్యాపారాలు చేస్తున్నాం. నెలకు 50 కిలోల బియ్యం అవసరం. 5 కిలోలు వంటనూనె వాడేవారం. ఇప్పుడు పొదుపుగా వాడుతున్నాం. మిగతా వాటి ధరలూ పెరిగాయి. కూరగాయలు కొనలేని పరిస్థితి. ధరలను అదుపులోకి తేవాలి.



సర్దుకుపోతున్నాం: రేణుక, మేడిపల్లి, చిన్నకోడూరు

ఇంట్లో మొత్తం నలుగురం ఉంటున్నాం. బియ్యం, నూనె, పప్పు ధరలు పెరగడంతో కొనాలంటే ఇబ్బందిగా ఉంటోంది. ఆర్థిక భారం పడుతోంది. పప్పులకు ప్రత్యామ్నాయంగా పొలంలో లభించే కూరగాయలు ఎక్కువగా తింటున్నాం. వంటనూనె వినియోగం తగ్గించాం.



గజ్వేల్ పట్టణంలో హారతులు



బాలాత్రిపురసుందరిగా వర్గల్ సరస్వతిదేవి



సిద్దిపేట: మహారేణుకా అమ్మవారు



జిల్లాకేంద్రంలో లలితా పరమేశ్వరి ఆలయంలో..

అమ్మ అపురూపం

దేవి శరన్నవరోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో, మండపాల్లో చతుష్షష్టి పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, అన్నదానాలు, నీరాజనాలతో వైభవోపేతంగా గురువారం అర్చనలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రేణుకాదేవికి గీతాపారిశ్రామిక సహకార సంఘం, కాళ్లకుంట కాలనీలో లలితాపరమేశ్వరికి, గంగాభవాని ఆలయంలో యూత్ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల పట్టణాల్లోనూ, మండల కేంద్రాల్లోనూ ఆలయాలు, మండపాల్లో అమ్మవార్లకు పూజలు చేశారు. గజ్వేల్ సంతోసిమాత అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. వర్గల్ విద్యాధరి క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ నేతృత్వంలో అంకురార్పణ జరిగింది. లక్ష్మీగణపతి, శనైశ్చర, వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర, కల్యాణ వేంకటేశ్వర, చంద్రమౌళీశ్వర స్వామి క్షేత్రాలను వర్గల్‌లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
– న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్, వర్గల్, గజ్వేల్

పక్కాగా కార్డుల నమోదు: కలెక్టర్



ముఖ్యమంత్రి నిర్వహించిన దృశ్య సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనూరాధ

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం), సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కుకునూరుపల్లి మండలం ముద్దాపూర్ గ్రామంలో గురువారం మూడు బృందాలుగా ప్రారంభించిన తెలంగాణ కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను జిల్లా కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో అధికారులు ఎలాంటి పొరపాట్లు జరగుండా కుటుంబ సభ్యులందరి పేర్లు పక్కాగా నమోదు చేయాలని అన్నారు. సర్వేలో 46 కుటుంబాల పేర్లు నమోదు చేశారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల వైద్యాధికారి ఫరీన్, ఎంపీవో విష్ణు, ఆర్ఐ సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి నవనీత తదితరులు ఉన్నారు. సిద్దిపేటలోని 34వ వార్డులో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆర్డీవో సదానందం, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ● ధాన్యం కొనుగోళ్లు, డీఎస్సీ రిక్రూట్‌మెంట్ తదితర అంశాలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలసి అన్ని జిల్లాల పాలనాధికారులతో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృశ్య సమీక్ష నిర్వహించగా జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనూరాధ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, డీసీఎస్‌వో తనూజ, మేనేజర్ ప్రవీణ్, మార్కెటింగ్ అధికారి నాగరాజు, డీఏవో రాధిక, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'



మాట్లాడుతున్న స్థిరాస్థి వ్యాపారుల సంఘం ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని స్థిరాస్థి వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం, కార్యదర్శి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో గురువారం వారు మాట్లాడారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఎల్ఆర్ఎస్‌పై విమర్శలు చేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే ఎల్ఆర్ఎస్‌తో రాష్ట్ర ఖజానా నింపడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే జీరో ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రియల్ వ్యాపారం అంతంతమాత్రంగానే సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబరు 1 నుంచి భూముల విలువ పెంచాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్థిరాస్థి వ్యాపారుల సంఘం ప్రతినిధులు సంజీవులు, మల్లారెడ్డి, భగవాన్‌రెడ్డి, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను రక్షిద్దాం

సిద్దిపేట: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని, వన్యప్రాణులను రక్షించాలని డీఎఫ్‌వో శ్రీనివాస్, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన్యప్రాణి పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉపన్యాసం, వ్యాసరచన, చిత్రలేఖన తదితర పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్స్ సత్యనారాయణ రెడ్డి, రాణి, అటవీ శాఖ అధికారులు, అధ్యాపకులు ఉన్నారు.

జీజేఎల్ఏ జిల్లా కార్యవర్గం

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం (జీజేఎల్ఏ) జిల్లా అధ్యక్షుడిగా సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిద్దిపేటలో గురువారం కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మధుసూదన్ రావు, మరో ఆరుగురు సభ్యులు ఎన్నికయ్యారు. ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి, టీజీఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

పంచాయతీలకు ఊరట

● జిల్లాకు రూ.6.47 కోట్ల నిర్వహణ నిధుల విడుదల



చెర్లఅంకిరెడ్డిపల్లిలో కార్యాలయం

న్యూస్‌టుడే, గజ్వేల్, సిద్దిపేట: ప్రత్యేక పాలనలో కొనసాగుతున్న గ్రామపంచాతీల్లో వివిధ పనులు చేపట్టేందుకుగాను ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇప్పటికే పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, కార్మికుల వేతనాలు, కార్యాలయాల నిర్వహణ బాధ్యతలు చూస్తున్న అధికారులు కొన్నింటి చోట స్వయంగా ఖర్చు చేయగా పలు పంచాయతీల్లో ఉద్దెర పద్దులతో కొనసాగిస్తు వస్తున్నా వేలకువేలు పెండింగ్‌లో పడటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పండుగకు ముందట నిధులు విడుదల చేయటంతో ఊరట లభించినట్లైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2 వరకు గ్రామ సర్పంచ్‌లు, పాలకమండలి బాధ్యత వహించింది. పదవీ కాలం పూర్తవటంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. గతంలో సర్పంచ్‌లు ఉన్న సమయంలో సొంతంగా ఖర్చు చేసి తరువాత నిధులు విడుదలైనపుడు తీసుకునేవారు. పంచాయతీల్లో అధికారుల పర్యవేక్షణ వచ్చిన తరువాత నిధులు లేకపోవటంతో సొంతగా ఖర్చు చేసేందుకు కొందరు అధికారులు ధైర్యం చేయకపోవటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. నిర్వహణ లోపంతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడి ప్రజలు రోగాల బారిన పడ్డారు. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయటంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా గ్రామాల్లో జనాభా ఆధారంగా నిధులు కేటాయించారు. 3 వేల లోపు జనాభా ఉంటే రూ.50 వేలు, 3 -8 వేల జనాభా ఉంటే రూ.75 వేలు, 8 వేలకి పైగా జనాభా ఉంటే రూ.లక్ష చొప్పున విడుదల చేశారు.

విడుదలైన నిధులు (రూ.లో)

విద్యుత్తు ఛార్జీలు	1.50 కోట్లు
స్వచ్ఛత, పచ్చదనం	2.61 కోట్లు
కార్మికుల వేతనాలు	2.19 కోట్లు
ట్రాక్టర్ ఈఎంఐలు	16.72 లక్షలు

జిల్లాలో మండలాలు	23
పంచాయతీలు	499
పారిశుద్ధ కార్మికులు	2180

తీగలు అపహరిస్తున్న ఇద్దరి అరెస్టు

కొండపాక గ్రామీణం: వ్యవసాయ క్షేత్రాల్లోని బోరు మోటర్ల తీగలు, ఇతరు విద్యుత్ సామాగ్రి అపహరించే ఇద్దరు నిందితులను కుకునూరుపల్లి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కుకునూరుపల్లిలో ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. దుబ్బాక పట్టణం, మారెమ్మగడ్డకు చెందిన ఇద్దరు నిందితులు నూనె నర్సింలు, పానేటి ఎల్లయ్య కూలీ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నారు. జల్సాలకు అలవాటయ్యారు. ఈఏడాది జులైలో ఎల్లారెడ్డిపేట పంపుహౌస్‌లో కప్లింగులు, నట్లు, బోల్టులు దొంగలించారు. తూప్రాన్‌లో అమ్మేశారు. వర్గల్‌కు వెళ్లి మైలారంలో మోటారు, స్టార్టర్ తీగలు దొంగలించి శామీర్‌పేటలో అమ్మారు. సెప్టెంబరులో గజ్వేల్ వైపు వెళ్తూ చందాపూర్‌లో 12 బోరు బావుల వద్ద తీగలు చోరీ చేశారు. ఇదే నెలలో దుబ్బాక నుంచి మల్లన్నసాగర్ కాలువలో మోటారు తీగలు దొంగలించారు. వాటిని తూప్రాన్, రామాయంపేటలో అమ్మారు జల్సాలు చేశారు. కుకునూరుపల్లి పోలీసులు లకుడారం క్రాస్‌రోడ్డుపై పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు నిందితులు ఆటోలో కనిపించారు. వారి నుంచి వాహనం, రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

నాటుబాంబుల తయారీ ముఠాలో ఐదుగురు..

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలంలో నాటుబాంబుల తయారీ ముఠాకు చెందిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక ఎస్ఐ తోట మహేశ్‌తో కలిసి సీఐ కొండ్రు శ్రీను తెలిపిన వివరాలు.. కొద్ది రోజుల కిందట మండలంలోని మీర్జాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు గుట్ట పక్కనున్న వ్యవసాయ క్షేత్రాల వద్ద జంతువులు, వన్యప్రాణులను వేటాడేందుకు నాటుబాంబులు పెట్టారు. ప్రమాదవశాత్తు బాంబు పేలి అదే గ్రామానికి చెందిన ఎండీ ఖలీం తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై బాధితుడి సోదరుడు తాజోద్దీన్ ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టామన్నారు. విచారణలో భాగంగా మీర్జాపూర్‌లోని ఒక ఇంటిలో నాటుబాంబు ఉన్నట్లు సమాచారం అందడంతో వెంటనే వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుబాంబులు తయారు చేస్తున్న పిట్టల స్వామి, బదనాపురం తిరుపతి అలియాస్ ఎరుకల తిరుపతి, కందుకూరి భాస్కర్ అలియాస్ కమ్మరి భాస్కర్, ఇటిక్యాల సతీశ్, శ్రీమంతుల శ్రీనివాస్‌లను పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. కానిస్టేబుళ్లు రాజు, నరేశ్, శేఖర్ ఉన్నారు.

భారాస, కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తత



దుబ్బాకలో నిరసిస్తున్న కాంగ్రెస్ నాయకులను నిలువరిస్తున్న పోలీసులు

దుబ్బాక, సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: దుబ్బాకలో గురువారం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పర్యటనను కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకునేందుకు యత్నించారు. భారాస, కాంగ్రెస్ నాయకుల మధ్య ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. మంత్రి సురేఖపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెడుతుండటాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే పర్యటన అడ్డుకునేందుకు యత్నించారు. ఓ ప్రముఖ హీరోయిన్, కేటీఆర్ చిత్రాలు ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు నిలువరించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ పూర్తి చేసుకొని, దుబ్బాక పురపాలిక సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు కాన్వాయ్‌తో వస్తుండగా, శివాజీ చౌరస్తా వద్ద కొందరు కోడిగుడ్లను వాహనాల పైకి విసిరారు. అవి దూరంగా పడిపోయాయి. భారాస, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా ఒకరిపై ఒకరు దూసుకెళ్లే యత్నాన్ని పోలీసులు ఆపారు. ఈ అలజడితో పట్టణంలో ప్రజల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే చేపట్టాలి



మంగంపేటలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ప్రత్యేకాధికారిణి హరిచందన

జిన్నారం, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని మంగంపేటను ఎంపిక చేయడంతో గురువారం నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వేను జిల్లా ప్రత్యేకాధికారిణి హరిచందన పరిశీలించారు. మూడు బృందాలుగా ఏర్పాటైన కార్డుల జారీ కోసం వివరాలు సేకరిస్తున్న తీరును తహసీల్దార్ భిక్షపతి ఆమెకు వివరించారు. ఇంట్లో మొత్తం సభ్యులు, కార్డు యజమానిగా మహిళ ఉండేలా చూసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. గ్రామంలో 179 కుటుంబాలుండగా మొదటి రోజు 134 పూర్తయ్యాయి. ఎంపీడీవో అరుణారెడ్డి, ఎంపీవో రాజ్‌కుమార్, తదితర అధికారులకు హరిచందన పలు సూచనలు చేశారు. లోపాలు లేకుండా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదేశించారు. పటాన్‌చెరు నియోజకవర్గ నోడల్ అధికారి దేవుజా తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో ఎదిగి.. ఐక్యతతో ఒదిగి

ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారు పేరు. విద్యార్థి దశలో జాతీయ భావాలు పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సమగ్రతకు బాట వేసేలా.. ఏకతా నినాదాన్ని వినిపిస్తుంది. సేవ వైపు మళ్లిస్తుంది. గొప్ప వ్యక్తిత్వంతో ఉన్నతంగా రాణించేందుకు బాటలు వేస్తుంది. ఆ దిశగా ఉమ్మడి జిల్లా సంస్థల్లో (నేరుగా కల్పించడంలో నేషనల్ కేడెట్ కార్ప్స్) కీలకపాత్ర పోషిస్తోంది. డిగ్రీ దశలో ఈ బృందాలు.. ప్రభావవంతంగా, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 17 డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో ఎన్‌సీసీ అమలవుతోంది. 1546 మంది విద్యార్థులు కేడెట్లుగా కొనసాగుతున్నారు. సిద్దిపేట నగరం స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు ఇప్పటి వరకు 21 మంది అగ్నిపథ్‌లో చేరారు. ఏటా పోలీసు లేదా ఆర్మీలో 10 మంది కొలువులు సాధిస్తున్నారు. మెదక్, సంగారెడ్డిలోనూ కేడెట్లు ఉద్యోగాలు సాధిస్తున్నారు.

సద్వినియోగంతో భవిత ఖాయం

విద్యార్థి దశలో కీలకంగా ఎన్‌సీసీ

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి టౌన్, మెదక్ టౌన్, వికారాబాద్ టౌన్

సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్దకు చెందిన జి.సతీశ్ కుమార్ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతేడాది డిగ్రీ పూర్తిచేశారు. 2023లో తృతీయ సంవత్సరం చదువుతున్నప్పుడే పోలీసు కానిస్టేబుల్ (సివిల్) పరీక్ష రాసి లక్ష్యాన్ని సాధించారు. 9వ తరగతిలో ఎన్‌సీసీలో చేరడం కలిసొచ్చింది. దీని కోటా కింద కొలువుకు దరఖాస్తు చేసుకున్నారు. మార్కులు కలిసొచ్చాయి. ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులు

జిల్లాల వారీగా ఇలా..

కేడెట్లు	డిగ్రీ కళాశాలలు	
600	7	సంగారెడ్డి
700	4	సిద్దిపేట
160	1	మెదక్
86	2	వికారాబాద్

శిక్షణ.. బాధ్యతలు

- విద్యాసంవత్సరంలో మొత్తంగా కేడెట్లకు 40 వరకు తరగతులు నిర్వహిస్తారు.
- కవాతు, మ్యాప్ రీడింగ్, సాయుధ శిక్షణ, సామాజిక సేవలో తప్పనిసరిగా భాగస్వాములయ్యేలా చూస్తారు.
- విపత్తులు, ఇతర సందర్భాల్లో సేవ చేయాల్సి ఉంటుంది.
- వారంలో రెండు గంటలు తరగతులు, డ్రిల్ సాధన చేయాలి.
- ఏడాదిలో ఒకసారి ప్రాక్టికల్, థియరీ పరీక్షలు ఉంటాయి.
- పాఠశాల స్థాయిలో ఏ, డిగ్రీ స్థాయిలో బీ, సీ ధ్రువ పత్రాల పరీక్షలు ఉంటాయి. ప్రతి ఏటా ఒక శిబిరానికి హాజరు కావాలి.




సాయుధ శిక్షణలో కేడెట్లు

జనరల్ ఎలక్టివ్ పేపర్..

గతంలో ఎన్‌సీసీ సహ పాఠ్య కార్యక్రమంగా కొనసాగించారు. గతేడాది నుంచి దీన్ని కోర్సులో ఒక పేపర్‌గా గుర్తించారు. గత విద్యాసంవత్సరంలో ఎన్‌సీసీని ఓ పేపర్‌గా గుర్తించాలని యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) అన్ని వర్సిటీలకు సూచించింది. జనరల్ ఎలక్టివ్ (జీఈ) పేపర్‌గా డిగ్రీ తృతీయ సంవత్సరంలో విద్యార్థులు ఎంచుకోవచ్చు. ఇతర పేపర్ల మాదిరిగానే క్రెడిట్లు (మార్కులు) పొందే వీలుంది. ఉన్నత విద్యలో చేరేందుకు 'సి' సర్టిఫికెట్‌ను ఉపయోగించుకుంటున్నారు.

ఉన్నత పౌరులుగా..:



ఎన్‌సీసీలో చేరిక ఎంతో ఉపయోగకరం. మానసికంగా, శారీరకంగా దృఢంగా మారుతారు. సమస్యలు ఎదురైనా తట్టుకుని నిలబడే సామర్థ్యం కలిగి ఉంటారు. ఉన్నత విద్య, ఉద్యోగంలో మంచి అవకాశాలు ఉంటాయి. అన్ని కళాశాలల్లో అందుబాటులోకి తెస్తే మేలు.

లెఫ్టినెంట్ మహేందర్‌రెడ్డి, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి, గజ్వేల్

సద్వినియోగం చేసుకోవాలి:



విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దేశభక్తి చాటేందుకు ఇదో వేదిక. గుర్తించుకోవాలి. విద్యార్థులకు క్రమశిక్షణ కూడా అలవాటవుతుంది. ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకుంటారు.

విజయ, ఎన్‌సీసీ అధికారి, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి

ప్రయోజనాలు..

● విశ్వవిద్యాలయాల్లో కోటా కింద ఉన్నత విద్యలో ప్రవేశం పొందవచ్చు. ● వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే శిబిరాల ద్వారా జాతీయ సమైక్యతా భావం పెరుగుతుంది. ● దేశ రక్షణ విభాగాల్లో చేరడం సులువు. ● సర్టిఫికేట్ ఆధారంగా పోలీసు శాఖ, ఆర్మీలో ప్రాధాన్యం ఇస్తారు. ● దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ శిబిరంలో పాల్గొని కవాతు చేయవచ్చు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వృద్ధురాలి మృతి

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని రాయిలాపూర్‌కు చెందిన అన్నబోయిన సావిత్రి (65) గత నెల 28న దుబ్బాకకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గ్రామ శివారులో కుక్కలు అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. సావిత్రిని ములుగు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కోడలు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మరో ఘటనలో యువకుడు..



నవీన్

కంది: ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాలు.. కంది మండలం చిమ్నాపూర్‌కు చెందిన ఏర్పుల నవీన్(36) ఐటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో కుక్కలు అడ్డురావడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు గాయాలు కాగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనతో ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య శిరీష సంగారెడ్డి రూరల్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

చికిత్స పొందుతూ మహిళ..



లక్ష్మి

మిరుదొడ్డి: ద్విచక్ర వాహనంపై నుంచి పడి గాయాలైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. భూంపల్లి ఎస్సై హరీష్ తెలిపిన వివరాలు.. మిరుదొడ్డి మండలం అల్వాలకు చెందిన లక్ష్మి తనకుమారుడితో కలిసి గతనెల 25న ద్విచక్ర వాహనంపై మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంటకు బయలుదేరారు. అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతారెడ్డిపేట శివారులో బైక్ అదుపుతప్పి కింద పడగా లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఆన్‌లైన్ బెట్టింగ్.. వ్యాపారి..



నవీన్

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో నష్టపోయిన వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పరుశరాములు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన ఈదారి నవీన్ (27) ఎరువులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సులువుగా ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మరలి, రూ.26 లక్షల అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. వాటిని తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపానికి గురైన పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవీన్‌కు భార్య రాధిక, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కడుపు నొప్పి భరించలేక మహిళ..

బెజ్జంకి, న్యూస్‌టుడే: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని గుగ్గిళ్లకు చెందిన కనకవ్వ(38)కు భర్త సంపత్, ముగ్గురు కుమార్తెలు ఉండగా, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మూడేళ్ల కిందట అనారోగ్య సమస్యలతో ఆమెకు శస్త్రచికిత్స చేసి గర్భసంచిని తొలగించారు. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది గురువారం పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. 108 వాహనంలో కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

రైలుకిందపడి గుర్తు తెలియని వృద్ధుడు..

తాండూరు టౌన్: రైలుకింద పడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాండూరులో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం రైల్వే యార్డు సమీపంలో 60 ఏళ్ల వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహంపై నలుపు, ఎరుపు, తెలుపు రంగు స్వెట్టరు ఉంది. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి శవాగారంలో భద్రపరిచారు.

అనారోగ్యంతో మహిళ..

మొయినాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన సున్నం జగ్గమ్మ(28) మూడేళ్లుగా నజీబ్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటోంది. ఆమె కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో బుధవారం గుర్తు తెలియని పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఉస్మానియా దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

యువకుడిపై కత్తితో దాడి

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ యువకుడిపై కత్తితో దాడిచేసిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై క్రిష్ణారెడ్డి సమాచారం ప్రకారం.. బెజ్జంకికి చెందిన సోమని ప్రవీణ్ కొద్ది నెలలుగా కోరుట్లలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన పలువురి వద్ద కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకుండా ఆలస్యం చేస్తున్నాడని గ్రామానికి చెందిన వేల్పుల శ్రీను, వేల్పుల శ్రీకాంత్, వేల్పుల చందు, మరికొందరితో కలిసి గురువారం కారులో హైదరాబాద్ వెళ్తున్న ప్రవీణ్‌ను తోటపల్లి వద్ద అడ్డగించారు. కత్తితో దాడిచేసి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుకు బాలుడి బలి



మణికేశ్వర్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: పాము కాటుతో బాలుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన తుమ్మల శ్రీనివాస్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మణికేశ్వర్(7) ఉన్నారు. శ్రీనివాస్ ఉపాధికి 20రోజుల కిందట గల్ఫ్ వెళ్లాడు. లక్ష్మి బీడీ కార్మికురాలిగా పని చేస్తోంది. బడికి సెలవులు కావడంతో గురువారం మణికేశ్వర్ తల్లి వెంట బీడీ కంపెనీకి వెళ్లాడు. అక్కడ ఖాళీ స్థలంలో బాలుడు అట్టపెట్టెను తీస్తుండగా, నాగుపాము కాటు వేసింది. ఈ విషయాన్ని అక్కడున్న వారు గమనించలేదు. కాలుకు ఏదో గుచ్చుకుంది అని భావించారు. ఇంటికి వెళ్లే సరికి మణికేశ్వర్ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. గ్రామస్థులంతా బీడీ కంపెనీ వద్దకు వెళ్లి, ఖాళీ అట్టపెట్టెలను తొలగించి చూడగా నాగుపాము కనిపించింది. పాము కాటుతోనే బాలుడు మరణించాడన్నారు. మణికేశ్వర్ ఒకటో తరగతి చదువుతున్నాడు. చిన్నారి మృతితో విషాదం అలుముకుంది.

సాంకేతికత తోడుగా విద్యుత్తు సేవలు



ఎన్‌పీడీసీఎల్ యాప్

విద్యుత్తు వినియోగదారులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో టీజీ ఎన్పీడీసీఎల్ అడుగులేస్తోంది. ఇందులో భాగంగా సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వినియోగంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. వినియోగదారుడు తన అరచేతిలో ఉండే చరవాణి నుంచే పలు రకాలుగా వినియోగించుకునే అవకాశం ఉంది. నూతన సాంకేతికతను జోడించి వినియోగదారుల సౌకర్యార్థం 19 రకాల ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకు చేయాల్సిందల్లా స్మార్ట్‌ఫోన్‌లో కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుంది. సంబంధిత అధికారులు దీనిపై అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు దీనిద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

ఏ మేర పెరిగిందో..: ఇందులో బిల్లు కాలిక్యులేటర్‌ను సైతం అందుబాటులో ఉంచారు. ఎన్ని యూనిట్లు వాడితే ఎంత బిల్లు వస్తుంది, యూనిట్లు ఎక్కువైన కొద్ది ఛార్జీ పెరిగే తీరు తెలుసుకోవచ్చు. ఆయా ఆప్షన్లతో పాటు కొత్త కనెక్షన్ పొందడం, పేరు, లోడు మార్పు, విద్యుత్తు నిబంధనలు, టారీఫ్ వివరాలు, ఏ విభాగానికి ఎంత ఛార్జి, గృహ, గృహేతర, పరిశ్రమలు తదితర వివరాలూ చూసుకోవచ్చు. పొదుపు, సూచనలనూ పొందుపరిచారు. ప్రమాదం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగదారుల ఫీడ్ బ్యాక్ కూడా ఇచ్చే వీలుంది. టోల్ ఫ్రీ నంబరును సైతం పొందుపరిచారు.

- న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

యాప్‌లో ఇలా..

రిపోర్టు ఆన్ ఇన్సిడెంట్: ఎక్కడైనా ఏదైనా ప్రమాదం, ఘటన జరిగితే జీపీఎస్ లోకేషన్‌తో చరవాణిలో ఫొటో తీసి అధికారులకు పంపించవచ్చు. సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదు నమోదు: వినియోగదారులు తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు. మీటరు నంబరు, సమస్య రాస్తే దాన్ని పరిష్కరిస్తారు. అది ఏ స్థాయిలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. ఒకవేళ సమస్య తీరకపోతే మరో సారి ఫిర్యాదు చేయవచ్చు.

సెల్ఫ్ రీడింగ్: ప్రతి నెలా విద్యుత్తు సిబ్బంది వచ్చి మీటరు రీడింగ్ తీస్తారు. అలా కాకుండా వినియోగదారుడే నేరుగా మీటరు రీడింగ్ తీయవచ్చు. ఎంత మేర విద్యుత్తు వాడాం, ఏ మేర బిల్లు వచ్చిందో తెలుసుకోవచ్చు.

బిల్లు చెల్లింపు: యాప్ ద్వారా బిల్లు చెల్లించవచ్చు. ఆయా వివరాలు వెంటనే చూసుకునే వీలుంది. గతంలోని వివరాలూ తెలుసుకోవచ్చు.

ఆధార్ లింక్: విద్యుత్తు మీటరుకు ఆధార్‌తో పాటు చరవాణి నంబరు అనుసంధానం చేసి ఉంటే ప్రతి నెలా బిల్లు, ఇతర వివరాల సందేశాలు వస్తాయి. అధికారులు ఇప్పటికే ఆయా వివరాలు నమోదు చేశారు. అయితే చాలా మంది నమోదు చేసుకోలేదు. అలాంటి వారు యాప్‌లో వాటిని నమోదు చేసుకోవచ్చు.

విధుల్లో నిర్లక్ష్యం.. పోలీసు అధికారులపై వేటు

వికారాబాద్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా, విధులలో నిర్లక్ష్యం.. వెరసి వికారాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలపై పోలీసు శాఖ చర్యలకు ఉపక్రమించింది. వికారాబాద్ పట్టణ సీఐ నాగరాజును సస్పెండ్ చేయగా, తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్‌లను ఐజీ కార్యాలయానికి, యాలాల, పెద్దేముల్ ఎస్ఐలు శంకర్, గిరన్నలను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం(అటాచ్) చేస్తూ మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. జోగిపేట సీఐగా విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో వికారాబాద్ సీఐ నాగరాజు ఓ మైనర్‌పై జరిగిన అత్యాచారం కేసులో విధుల పట్ల నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడటంతో పాటు కేసును నీరుగార్చేలా దర్యాప్తు చేశారన్న అభియోగంతో సస్పెన్షన్ వేటు వేశారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్, యాలాల, పెద్దేముల్ ఎస్ఐలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలం, ఇతర కారణాలతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా అనుసంధానం చేశారని పోలీస్ వర్గాలు తెలిపాయి.

సంగారెడ్డిలో ఇద్దరిపై..

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన ఇద్దరు పోలీసు అధికారులపై వేటు పడింది. సంగారెడ్డి గ్రామీణ సీఐ అశోక్, ఎస్సై వినయ్‌కుమార్‌ను వీఆర్‌కు ఆటాచ్ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి, కంది మండలాల్లోని నక్క వాగు పరిధిలో కృత్రిమ ఇసుక తయారీ జోరుగా సాగుతోంది. అనుమతుల్లేకుండా తవ్వుతుండడంతో పర్యావరణం దెబ్బతినడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని నిఘా వర్గాల ద్వారా పోలీసు శాఖ సమాచారం సేకరించింది. అక్రమార్కులకు సీఐ, ఎస్సై ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడంతో చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాలగోకులం.. సత్ప్రవర్తనకు మార్గం



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

వికారాబాద్ జిల్లాలో వ్యాపార, వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరులో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న బాలగోకులం చిన్నారి విద్యార్థుల్లో సత్ప్రవర్తన, దేశభక్తి పెంచేందుకు దోహదపడుతోంది. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవాన్ని చూపేలా చేస్తుంది. మూడేళ్ల కిందట కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టణ శివారులో ఒక చోట బాలగోకులాన్ని నిర్వహించారు. ప్రారంభంలో కొంతమంది పిల్లలే వచ్చారు. వారికి ఉపాధ్యాయులు ఆధ్యాత్మికం, దేశభక్తి, సమాజంలో మెలిగే తీరు, తదితర అంశాలను బోధించారు. ఇవన్నీ తల్లిదండ్రులకు నచ్చడంతో తమ పిల్లలను ఇక్కడికి పంపించే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇక్కడ విజయవంతమైన బాలగోకులాన్ని పట్టణంలో విస్తరించాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు. ఇలా ప్రస్తుతం మూడు చోట్ల ప్రతి ఆదివారం బాలగోకులం నిర్వహిస్తుండటం విశేషం.

ఆలయాలే వేదికగా..

ఆలయాలే వేదికగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. బసవేశ్వరనగర్‌లోని చెరువెంటి ఈశ్వరుడు, భవానీనగర్‌లోని రామలింగేశ్వరుడు, తులసీనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయాల వేదికగా జరుగుతున్నాయి. ముందుగా పిల్లలతో పూజలు, హారతి ఇప్పిస్తారు. రామాయణ, మహాభారత శ్లోకాలు నేర్పిస్తారు. నీతికథలు చెబుతారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం ఎలాగో నేర్పిస్తారు. అదే సమయంలో కుల, మతాలు లేని స్నేహం గురించి వివరించడంతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. చదువుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. పిల్లలు భవిష్యత్తులో సత్ప్రవర్తన కలిగి ఉండటం, ఉన్నత స్థాయికి ఎదగడం, సమాజం పట్ల సదాభిప్రాయం, తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని బాలగోకులం నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వరూప, శివకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆనందం తెలిపారు.

- న్యూస్‌టుడే, తాండూరు

గజ్వేల్.. మంత్రుల రాకతో జిగేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం, ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గురువారం రావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. సభలో మంత్రుల ప్రసంగాలకు హాజరైన వారు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. బోనాలు, కోలాటాలతో కళాకారులు ప్రదర్శన చేపట్టారు. గజ్వేల్ పట్టణమంతా ఒక్కసారిగా ముగ్గురు మంత్రులు రావడంతో ఆద్యంతం సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, గజ్వేల్



గజ్వేల్‌లో ప్రజ్ఞాపూర్ నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలో పార్టీ శ్రేణులు



ర్యాలీలో బోనాల ఊరేగింపు, కోలాటం, ఒగ్గు కళాకారుల ప్రదర్శన

ఉన్నతీకరించి.. ఉపయోగమేది?

● మినీ అంగన్‌వాడీల్లో జాడ లేని జీతభత్యాల పెంపు

న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట, పరిగి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వెయ్యి జనాభా ఉన్న ప్రాంతంలో ప్రధాన కేంద్రం, అంతకంటే తక్కువ జనాభా ఉంటే మినీ అంగన్‌వాడీలను నెలకొల్పింది. అయితే మినీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరగడంతో అక్కడ అందించే సేవలు ఇబ్బందికరంగా మారాయి. ఆయాల నియామకాలు లేకపోవడంతో, అంగన్‌వాడీ టీచర్లే నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం గత జనవరిలో మినీ కేంద్రాలను ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సమస్యలు పరిష్కారం అవుతాయని అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఉత్తర్వులకే పరిమితం..

రాష్ట్రవ్యాప్తంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఎనిమిది నెలల కిందట ఇచ్చిన ఉత్తర్వులు కాగితాలకే పరిమితమయ్యాయి. చాలా చోట్ల శాశ్వత భవనాలు కరవయ్యాయి. పిల్లలను ఆడించేందుకు ఆట వస్తువులు, ఇతర సామగ్రి కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాలేదు. కేవలం సరకులు ఇస్తుండగా, కేంద్రాలను నెట్టుకొస్తున్నారు.

● కేంద్రాలకు పక్కా భవనాలు లేక పాఠశాల అదనపు గదులు, సామాజిక, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మినీ కేంద్రాల్లో ఆయా పోస్టులు అవసరం. వీటి భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించినా ఇప్పటివరకు అడుగు పడలేదు. ఒక్కో మినీ కేంద్రంలో ఒక్కో టీచరు పని చేస్తుండగా ప్రతి నెలా రూ.7,800 చొప్పున వేతనం అందిస్తున్నారు. కేంద్రాల ఉన్నతీకరణ తర్వాత రెండు నెలలు టీచర్లకు పెంచిన జీతాలు రూ.13,650 చొప్పున అందజేసి, ఆ తర్వాత నిలిపివేశారు.

నాలుగు జిల్లాల్లో వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన	మినీ
మెదక్	1,076	191
సంగారెడ్డి	1,444	160
సిద్దిపేట	1,084	66
వికారాబాద్	757	350

విడుదల కావాల్సి ఉంది:

మినీ కేంద్రాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. రెండు నెలలు పెంచిన జీతాలను టీచర్లకు అందించాం. బడ్జెట్ కేటాయింపు లేక మళ్లీ పాత వేతనాలే జమయ్యాయి. పెంచిన వేతనాలు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

బ్రహ్మాజీ, మహిళ,శిశు సంక్షేమాధికారిణి, మెదక్

అత్యాచార నిందితుడిని శిక్షించాలి: ప్రభుత్వ విప్

చేర్యాల: కొమురవెల్లి మండలం గురువన్నపేటలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం డిమాండ్ చేశారు. కురుమ సంఘం ప్రతినిధుల బృందం గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సిద్దిపేటకు వెళ్లి సీపీ అనూరాధకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు క్యామ మల్లేశ్, నాయకులు ఉన్నారు. బాలిక ఇంటర్మీడియట్ వరకు విద్య అందించే బాధ్యత తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు.

చికెన్ ధరలు



ఫాంరేటు	112–00
రిటైల్	134–00
డ్రెస్డ్	194–00
స్కిన్‌లెస్	221–00

కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల పనితీరు అధ్వానం: కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, న్యూస్‌టుడే: పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పరిపాలన వ్యవస్థల పనితీరు అధ్వానంగా మారిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. గురువారం దుబ్బాక క్యాంపు కార్యాలయంలో 60 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక మహిళా మంత్రిపై భారాస నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అదే మహిళా మంత్రి ఇతర మహిళలు, వారి కుటుంబాలపై చేసిన వ్యాఖ్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త కిషన్‌రెడ్డి, కడతల రవీందర్‌రెడ్డి, గన్నె భూంరెడ్డి, భారాస కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.

తొగుట: తొగుటలో భారాస కార్యకర్త చింత నర్సింలు కుటుంబానికి రూ.రెండు లక్షల బీమా చెక్కు అందజేశారు. భారాస మండలాధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం కొండపాక మండల కేంద్రంలోని ఆనంద నిలయంలో పలువురు వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డా.నారాయణ రావు, కొండపాక పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీధర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వంతెన లేక.. వెతలు తీరక

● రూ.9 కోట్లతో రోడ్డు విస్తరించినా తప్పని వరద కష్టాలు

న్యూస్‌టుడే, బెజ్జంకి: రహదారి విస్తరణతో ప్రయాణికుల కష్టాలు తీరుతాయనుకుంటే అదే సమస్యలు మళ్లీ వెంటాడుతున్నాయి. బెజ్జంకి క్రాసింగ్ రహదారి శివారులోని ఈదులవాగు కల్వర్టుపై వరద ఉద్ధృతితో దశాబ్దాలుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించింది. అవసరమైన నిధులు మంజూరు చేసి లోలెవల్ కాజ్‌వే ఎత్తు పెంచి రహదారిని విస్తరించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. వరదలు వచ్చినప్పుడు గతంలో లాగే రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ వంతెన నిర్మించాలని ప్రజలు ఏళ్లుగా కోరుతున్నా ఆశించిన స్పందన లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వంతెన నిర్మించి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.


ఈదులవాగు కాజ్‌వేపై వరద ఉద్ధృతి

వానొస్తే రాకపోకలు బంద్

బెజ్జంకి క్రాసింగ్ నుంచి మండల కేంద్రమైన బెజ్జంకి శివారు వరకు రూ.9 కోట్లతో రెండు వరుసల రహదారి నిర్మించారు. పనులు పూర్తిచేసి సుమారు ఏడేళ్లు అవుతుండగా.. రహదారి విస్తరణతో పాటే అవసరమైన చోట కాజ్‌వేల వద్ద వంతెనల నిర్మాణానికి ప్రతిపాదించారు. మంజూరైన నిధులతో పనులు చేపట్టగా వంతెనల జాడ లేకుండా పోయింది. ప్రధానంగా బెజ్జంకిక్రాసింగ్ శివారులో రహదారిపై గతంలో కల్వర్టు ఉండగా భారీ వర్షాలు కురిసినప్పుడు ఈదుల వాగు ఉద్ధృతితో వరద పోటెత్తి రాకపోకలు నిలిచిపోయాయి. పలు వాహనాలు సైతం వరదలో కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి.

నీటమునుగుతున్న పొలాలు

రోడ్డు విస్తరణతో కల్వర్టుపై వంతెన నిర్మిస్తారని ఆశించినా కొంత ఎత్తు పెంచి వదిలేశారు. వరదనీరు సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు లేకుండా పోయాయి. బీరాపూర్, పోతారం, గుండారం, రేగులపల్లి, తదితర గ్రామాల శివారు నుంచి వచ్చే వరదతో ఈదుల వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండగా కాజ్‌వే ఎత్తు పెంచినా ప్రయోజనం లేకుండా పోయింది. వరద రహదారిని ముంచెత్తి ప్రవహిస్తుండగా చుట్టుపక్కల పొలాలు నీటమునిగి రైతులకు నష్టం వాటిల్లుతోంది. కరీంనగర్, సిద్దిపేట జిల్లా కేంద్రాలకు, మండల కేంద్రానికి ఈ మార్గం గుండానే ప్రయాణాలు సాగిస్తుండగా భారీ వర్షం కురిసిందంటే గంటల పాటు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దాచారం, క్రాసింగ్ పంచాయతీల ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రాకపోకలు నియంత్రించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈదులవాగుపై వంతెన నిర్మించాలని, ప్రయాణ పాట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం

వంతెన నిర్మాణానికి సమీప గ్రామాల నుంచి వినతులు వచ్చాయి. ఉన్నతాధికారులతో కలిసి పలుమార్లు కాజ్‌వేను పరిశీలించాం. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం.
సాజిద్, ఇన్‌ఛార్జి ఏఈ, ఆర్‌అండ్‌బీ

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585053, జగదేవపూర్ 8008573209, మిరుదొడ్డి 8008573520, దుబ్బాక 9030037175, చేర్యాల 8008574871, గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

దుబ్బాక, మిరుదొడ్డి, న్యూస్‌టుడే:

? దుబ్బాక పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, కేసీఆర్ పాఠశాల తదితర ప్రాంతాల్లో రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించాలి. – రమేశ్, దుబ్బాక

✔ పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లోనూ ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, దుబ్బాక సీఐ

? దుబ్బాక పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త డబ్బాలు పగిలిపోయి, నిర్వహణ అస్తవ్యస్తంగా మారి, మూలకు చేరాయి. – వికాస్, దుబ్బాక

✔ నూతన తడి, పొడి చెత్త డబ్బాలను ఏర్పాటు చేసి, పారిశుద్ధ్య నిర్వహణను మెరుగు పరుస్తాం. –రమేశ్ కుమార్, పుర కమిషనర్

? అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేటలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి. – రాజు, వీరారెడ్డిపల్లి

✔ ఉపకేంద్ర నిర్మాణ పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటాం. – రిజ్వాన్, పీఆర్‌ఏఈ, మిరుదొడ్డి

? మిరుదొడ్డి మండలం మల్లుపల్లిలో కుక్కల బెడద అధికంగా ఉంది. నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకొని ప్రజల ఇబ్బందులు తొలగించాలి. – నరసింహారెడ్డి, మల్లుపల్లి

✔ కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకొని ఇబ్బందులు తొలగిస్తాం. – గణేష్ రెడ్డి, ఎంపీడీవో, మిరుదొడ్డి

పకడ్బందీగా కుటుంబ సర్వే

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలట్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి అన్నారు. గురువారం అక్కన్నపేట మండలం నందారంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామంలో మూడు బృందాలు ఏర్పాటు చేయగా వారు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. సాయంత్రం వరకు 136 కుటుంబాల సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో జయరాం తెలిపారు. తహసీల్దారు అనంతరెడ్డి, సూపరింటెండెంట్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


నందారంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

హుస్నాబాద్: హుస్నాబాద్ పురపాలికలోని 11వ వార్డులో 315 కుటుంబాలకు పుర కమిషనర్, తహసీల్దారు, ఎంపీడీవో, ఎంపీవోలతో నాలుగు బృందాలుగా సర్వే వివరాలను నమోదు చేసుకున్నారు. ఒకే రోజు 96 ఇళ్ల సర్వే పూర్తి చేసినట్లు కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ తెలిపారు.

గజ్వేల్: ఎఫ్‌డీసీ(ఫ్యామిలీ డిజిటల్ కార్డు) సర్వేను గజ్వేల్‌లోని 17 వార్డులో మున్సిపల్ ఛైర్మన్ ఎన్సీ రాజమౌళి గురువారం ప్రారంభించారు. కమిషనర్ నర్సయ్య, కౌన్సిలర్ లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాక: పురపాలికలోని చెల్లాపూర్ 2వ వార్డులో పురాధ్యక్షురాలు గన్నె వనిత, మండలంలోని హసన్‌మీరాపూర్‌లో ఎంపీడీవో భాస్కరశర్మ ప్రారంభించారు. పుర కమిషనర్ రమేశ్ కుమార్, తహసీల్దారు నల్ల వెంకటరెడ్డి, కౌన్సిలర్ దేవలక్ష్మి, డీటీ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు: మండల పరిధి నాగరాజుపల్లిలో కుటుంబ డిజిటల్ సర్వే నిర్వహించారు. తహసీల్దారు సరిత, ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీవో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించాలి

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక పురపాలికను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పురాధ్యక్షురాలు గన్నె వనిత అన్నారు. బతుకమ్మ పండుగకు సంబంధించి వార్డుల్లో ఉన్న చెరువుల వద్ద రూ.15 లక్షలతో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. గురువారం దుబ్బాక పురపాలికలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశపెట్టిన 13 ఎజెండా అంశాలను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. పురపాలికలో గతంలో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాల్లో కొంత మొత్తం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పురపాలికలో సమస్యల పరిష్కారానికి, పలు అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని పాలకవర్గం సభ్యులు కోరగా, సీడీఎంఏ ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. పురపాలికలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలని, లోటు పాట్లు జరగకుండా చూడాలని పుర అధికారులను ఆదేశించారు. సమావేశంలో పుర కమిషనర్ రమేశ్‌కుమార్, వైస్ ఛైర్‌పర్సన్ అధికం సుగుణ, కౌన్సిలర్లు, పుర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో పురాధ్యక్షురాలు వనిత తదితరులు

సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే!

నంగునూరు, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్ హెచ్చరించారు. మండల పరిధి బద్దిపడగలో ఇటీవల మూడు డెంగీ కేసులు నమోదైన నేపథ్యంలో గురువారం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆశాలు చేపడుతున్న ఫీవర్ సర్వే, వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమాల పనితీరు, డెంగీ కేసుల నివారణ చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి అంజలి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డా.ఆనంద్

యాసంగిలో ఆరుతడి పంటల సాగు మేలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని తొర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల రైతు వేదికలో గురువారం ఆరుతడి పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాసంగిలో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, జొన్న, పెసర, మినుము, కూరగాయల పంటలు లాభదాయకమని తెలిపారు. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15వరకు అపరాలు, అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకు వేరుశనగ, శనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు విత్తుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, ఏవో శ్రీనాథ్, శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి, ఉమారాణి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీదేవి

రాయపోల్: రాయపోల్ మండల పరిధిలోని అనాజీపూర్‌లో పత్తి, కంది పంటలను మండల వ్యవసాయ అధికారి నరేష్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈవో కవిత, రైతులు ఉన్నారు.

పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు: తుమ్మల

ములుగు, న్యూస్‌టుడే: పార్టీ అభివృద్ధికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు తప్పనిసరిగా ప్రత్యేక గుర్తింపు ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం గజ్వేల్ పర్యటనకు వెళుతున్న మంత్రి తుమ్మలకు ములుగు మండల కాంగ్రెస్ నేత గంగిశెట్టి శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో కార్యకర్తలు రాజీవ్ రహదారిపై ములుగు మండలం వంటిమామిడి వద్ద ఘన స్వాగతం పలికారు. టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ రావు, నాయకులు శ్రీనివాస్, భూపాల్ రెడ్డి, నల్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


రాయపోల్: వడ్డేపల్లిలో బాలా త్రిపురసుందరిగా అమ్మవారు


కొండపాక గ్రామీణం: మర్పడ్గలో విజయ దుర్గా మాత


జగదేవపూర్: కొండపోచమ్మ ఆలయంలో దుర్గామాతకు పూజలు చేస్తూ..


హుస్నాబాద్: దుర్గామాత ఊరేగింపు

అమ్మను తలచి.. భక్తితో కొలిచి

రాయపోల్, జగదేవపూర్, చేర్యాల, కొండపాక గ్రామీణం, చిన్నకోడూరు, హుస్నాబాద్, న్యూస్‌టుడే: దుర్గా నవరాత్రులు పురస్కరించుకొని జిల్లాలోని పలు ఆలయాల్లో గురువారం అమ్మవారిని బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి పూజించారు. రాయపోల్, చిన్నకోడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలు నెలకొల్పారు. కొండపోచమ్మ ఆలయంలో, చేర్యాల మండలం ఆకునూరు భవానీ రుద్రేశ్వరాలయంలో, కొండపాక మండలం మర్పడ్గలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఉత్సవాలను కనుల పండువగా జరిపారు. హుస్నాబాద్‌లో దేవీ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. గొర్రె పోతుల రథంతో దుర్గాదేవిని మండపానికి తరలించారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోండి

సిద్దిపేట టౌన్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని బల్దియా అధ్యక్షురాలు కడవేర్గు మంజుల అధికారులను ఆదేశించారు. పట్టణంలోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం (కేసీఆర్ నగర్), కోమటిచెరువు, ఎర్రచెరువు ప్రాంతాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలో పలుచోట్ల విద్యుద్దీపాలు లేనిచోట్ల వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లు సరిగా లేని పలు వార్డుల్లో గుంతలను మొరం పోయించి చదును చేయాలన్నారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో చెరువుల ప్రాంతాల్లో తాగునీటి వసతి కల్పించాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, బతుకమ్మలను లోతులోకి వెళ్లి వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేసీఆర్ నగర్‌లో అంతర్గత మురుగునీటి సమస్య గుర్తించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బల్దియా మాజీ ఛైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు బ్రహ్మం, బర్ల మల్లికార్జున్, సుందర్, బల్దియా అధికారులు ప్రేరణ, పృథ్వి, మాధవి, వనిత, సతీష్, భారాస నాయకులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న బల్దియా అధ్యక్షురాలు మంజుల

గాలివానతో వరి రైతుకు నష్టం

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం కపూర్‌నాయక్ తండా పరిధిలోని శ్రీరాం తండాలో ఈనెల 2న కురిసిన వర్షంతో వరిపంట దెబ్బతింది. వర్షంతో పాటు ఈదురు గాలులు రావడంతో కోతకు వచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. దీంతో గింజలన్నీ నేలపాలయ్యాయని, వరికోత కూడా కష్టమవుతుందని రైతులు తెలిపారు. తమ వరిపంట మొత్తం నేలవాలి అక్కరకురాకుండా పోయినట్లు తండాకు చెందిన ఆజ్మీర నరేష్, మాలోతు భిక్షపతి, మాలోతు నరేష్, వెంకటేశ్ అనే రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఎకరాల వరకు దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు.


శ్రీరాంతండాలో నేలవాలిన వరి పైరు

రెండో రోజు.. 271 మంది అభ్యర్థులు..

సిద్దిపేట, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన రెండో రోజూ గురువారం సజావుగా కొనసాగింది. సిద్దిపేట పట్టణం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ ప్రక్రియ నిర్వహించారు. తొలి రోజు ఎస్జీటీలతో ఆరంభమవగా, రెండో రోజు నుంచి ఎస్ఏ అభ్యర్థుల పత్రాల పరిశీలన మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి 271 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వరుస క్రమంలో టోకెన్ల జారీ, వివరాల నమోదు, కౌంటర్లలో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అభ్యర్థులను ఆహ్వానించిన విషయం తెలిసిందే.

‘యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం’

దుబ్బాక, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు పట్టభద్రుల ఓట్లతో ఎమ్మెల్సీలుగా గెలిచిన నాయకులు నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని ‘తెలంగాణ నిరుద్యోగ యూత్ ఫోరం, తెలంగాణ వీవర్స్ ఫ్రంట్’ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం రామకృష్ణప్రభు విమర్శించారు. గురువారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యువతకు ఉపాధి అవకాశాలు చూపడంలో విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టభద్రులకు అండగా నిలబడి, ప్రభుత్వాన్ని ప్రశ్నించే నాయకులకే పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు. చదువుకున్న యువత ఆలోచించి నాయకులను ఎన్నుకోవాలని కోరారు.

రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు

చేర్యాల, న్యూస్‌టుడే: ఆర్థిక సంఘం నిధులతో చేర్యాల పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేకాభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పురాధ్యక్షురాలు స్వరూపారాణి అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో కౌన్సిలర్ చెవిటి లింగం ఆధ్వర్యంలో రూ.10లక్షలతో చేపట్టిన పనులను గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నరేందర్, సతీశ్, తార, కమిషనరు నాగేందర్, మేనేజరు ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.


చేర్యాలలోని 2వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పురాధ్యక్షురాలు స్వరూపారాణి, కౌన్సిలర్లు

తనిఖీల్లో 15 వాహనాలు సీజ్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. పట్టణంలోని గుండ్లచెరువు ప్రాంతంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాల్లేని 14 ద్విచక్రవాహనాలు, ఒక కారు సీజ్ చేశారు. అనంతరం నార్కోటిక్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ కాలనీవాసులకు పలు సూచనలు చేశారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. పట్టణ మూడో ఠాణా ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, మహిళా ఠాణా ఇన్‌స్పెక్టర్ దుర్గ, ఎస్సైలు రాజేశం, ఆసిఫ్, బాలకృష్ణ, హరీశ్‌గౌడ్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచిపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం చౌటపల్లి మాజీ సర్పంచి గద్దల రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ఇటీవల నిప్పంటించిన ఘటనపై పోలీసుస్టేషన్‌కు వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన గాదర్ల నాగభూషణంపై రమేశ్ దాడి చేశారన్నారు. తనపై దాడి చేసిన మాజీ సర్పంచిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నాగభూషణం తమకు ఫిర్యాదు చేశారన్నారు.

ఇతరులను కించపరిచేలా మాట్లాడడం తగదు

కొండపాక గ్రామీణం: ఎమ్మెల్యే కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను మంత్రి కొండా సురేఖ వెంటనే ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరుతూ గురువారం కొండపాకలో భారాస నాయకులు ఆమె దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సినీనటులను కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. భారాస నాయకులు అంబటి బాలచందర్‌గౌడ్, ప్రశాంత్, హరీష్, రమేష్, శేఖర్, అరుణ్, అఖిల్ తదితరులు ఉన్నారు.

రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సిద్దిపేట అర్బన్: రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి ఐకాస జిల్లా అధ్యక్షుడు ఐలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో గురువారం ఆయన మాట్లాడారు. ఈ నెల 6న హైదరాబాద్ శిల్పకళా వేదికలో రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనంపల్లిపై గజ్వేల్ ఠాణాలో ఫిర్యాదు

గజ్వేల్, న్యూస్‌టుడే: మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌లపై అసభ్య పదజాలంతో దూషించిన కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారాస నేతలు వంటేరు ప్రతాప్‌రెడ్డి, బల్దియా ఛైర్మన్ రాజమౌళి, తదితరులు గురువారం గజ్వేల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. తక్షణమే పోలీసులు ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. గజ్వేల్ ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, బల్దియా ఉపాధ్యక్షులు జకి, భారాస మండల, పట్టణపార్టీ అధ్యక్షులు బధు, నవాజ్, కౌన్సిలర్లు తదితరులున్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించండి

కోహెడ: గ్రామాల్లో నీటి సహాయకులదే కీలక పాత్ర అని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసచారి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ సిబ్బందికి నీటిశుద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారిణి దేవకీదేవి, డీఈ రుహీన తస్కీం, ఎంపీడీవో కృష్ణయ్య, ఏఈ ప్రియాంక, ఎంపీవో శోభ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏ దారి.. ఏటువైపో?


గజ్వేల్ నుంచి బయ్యారం, రైల్వేస్టేషన్‌కు, దౌల్తాబాద్‌కు వెళ్లే దారిని చూపేలా సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. వీటికి చెట్ల కొమ్మలు అడ్డురావడంతో బోర్డు సరిగా కనిపించడం లేదు. దీంతో దారి తెలియక అటుగా వెళ్లే వారు తికమక పడుతున్నారు. కొమ్మలను తొలగిస్తే బోర్డు సరిగా కనబడుతుందని వాహనదారులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

బాబోయ్.. దుమ్ము!


సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి పనుల్లో భాగంగా హుస్నాబాద్ మండలం పందిల్ల వద్ద జరుగుతున్న పనులతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గుత్తేదారు కంకరపొడి వేసి నీళ్లు పట్టడం లేదు. దీంతో పెద్ద వాహనాలు వచ్చినప్పుడు విపరీతమైన దుమ్ము వస్తోంది. ఇళ్లన్నీ దుమ్ముతో నిండుతున్నాయని పందిల్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము రాకుండా పనులు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హుస్నాబాద్:

మహనీయుల జీవితం యువతకు ఆదర్శం


బస్వాపూర్‌లో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం

ములుగు, న్యూస్‌టుడే: మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించాలని ములుగు ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ములుగు మండలం బస్వాపూర్‌లో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించగలుగుతారన్నారు. కార్యక్రమంలో కృష్ణ గౌడ్, అర్జున్‌గౌడ్, లక్ష్మణ్ గౌడ్, సందీప్ గౌడ్, మొయిన్, అక్బర్, వెంకటేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.